

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

# మంత్రి సంధ్యారాణితో ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి భేటీ

- అంగన్వాడీ భవనాలకు నిధులు కేటాయించండి
- గిరిజన సమస్యలపై మంత్రి సంధ్యారాణికి మెమోరాండం
- చంద్రశేఖరపురంలోని ఏకలవ్య పాఠశాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి
- ఇందుకూరుపేట ట్రైబల్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయండి
- ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



**కోవూరు, జూన్ 25, ప్రభాతవార్త :** గిరిజన సంక్షేమ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణితో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి భేటీ అయ్యారు. నెల్లూరు నగరం మాగుంట నివాసంలో ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి నివాసానికి విచ్చేసిన మంత్రి సంధ్యారాణి అల్పాహార విందు స్వీకరించారు. ఈ సందర్భంగా కోవూరు నియోజకవర్గంలో గిరిజనులకు, అంగన్వాడీలకు సంబంధించిన పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకువచ్చారు. అసంపూర్తిగా ఉన్న 23 అంగన్వాడీ భవన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని కోరుతూ ఆమెకు మెమోరాండం సమర్పించారు. కోవూరు , ఇందుకూరుపేటలలో ఐసీడీఎస్ కార్యాలయాలతో పాటు మరికొన్ని అంగన్వాడీ కేంద్రాలకు మరమ్మత్తులు చేయించాలని కోరారు. నియోజకవర్గ పరిధిలోని 13 అంగన్వాడీ కేంద్రాలలో టాయిలెట్స్, మరో 12 అంగన్వాడీ కేంద్రాలలో తాగునీటి సౌకర్యం కోసం అవసరమైన వసతులకు 72 వేల రూపాయల నిధులు త్వరగా మంజూరు చేయాలని కోరారు. చంద్రశేఖరపురంలోని ఏకలవ్య పాఠశాల అభివృద్ధికి 3 కోట్ల 63 లక్షలు, అసంపూర్తిగా ఉన్న ఇందుకూరుపేట ట్రైబల్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులకు 34 లక్షల 80 వేలు నిధులు కేటాయించాలని కోరారు. తెలుగుదేశం పార్టీ నాయకులు దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి, బెజవాడ వంశీ కృష్ణారెడ్డి, అడపాల శ్రీధర్‌రెడ్డి, శ్యామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు అండగా నిలవడం చంద్రబాబునాయుడుతోనే సాధ్యం



**నెల్లూరు, జూన్ 25, ప్రభాతవార్త-వైద్యం :** పేదలకు అండగా నిలవడం చంద్రబాబునాయుడుతోనే సాధ్యం. కష్టాల్లో ఉన్న వారికిఆసరాగా ముఖ్యమంత్రి సహాయనిధి. సర్వేపల్లి నియోజకవర్గంలో మరో 35 మందికి రూ.45.38 లక్షల ఆర్థిక సాయం, బాధితులకు చెక్కులు పంపిణీ చేసిన సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి. ఎన్టీఆర్ వైద్య సేవ పథకం వర్తించని వారికి, పొరుగు రాష్ట్రాల్లో వైద్య సేవలు పొందిన వారికి సీఎంఆర్ఎఫ్ వరమని పేర్కొన్న సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి. పేదల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ఉదారంగా సాయం మంజూరు చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి ధన్యవాదాలు తెలియజేసిన సోమిరెడ్డి. ఇప్పటి వరకు సీఎం సహాయనిధి ద్వారా 215 మందికి రూ.2.63 కోట్ల సాయం.

## పెన్నానదిని పరిశీలించిన కేంద్ర ఎన్జీటి రీజనల్ డైరక్టర్



**బుచ్చి జూన్ 25 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం మండంలోని జొన్నవాడ గ్రామంలో పెన్నానదిని కేంద్ర ఎన్జీటి రీజనల్ డైరక్టర్ హెచ్చి వరలక్ష్మీ,ఆమె బృందం మరియు ఆర్‌డిఒ అనూష, పొల్యూషన్ బోర్డు అధికారులతో కలిసి పరిశీలించారు. పెన్నానది లో మురికి నీరు కలుస్తున్న ప్రాంతాన్ని పరిశీలించారు.సింగిరి మధు నేషనల్ ట్రిబునల్‌కు ఫిర్యాదు చేసిన నేపద్యంలో అధికారులు జొన్నవాడకు వచ్చారు.అనంతరం నీటి శాంపిల్స్ ను సేకరించారు. జొన్నవాడ ఆలయానికి సంబందించిన చెత్తను పెన్నానదిలో డంపు చేసి ఉండడాన్ని గమనించిన అధికారులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. గుడిలో వ్యర్ధాలను పెన్నానదిలో వేయడం అపరిశుభ్రంగా మారిదని స్దానికులు అధికారులు దృష్టికి తీసుకొని వెళ్లారు. మూడోవ శనివారం ఎమ్మెల్యేతో కలిసి గ్రామంలో స్వచ్ఛంద కార్యక్రమం నిర్వహిస్తామని ఆర్‌డిఒ తెలిపారు. పారిశుద్యం లోపించిందని అన్నారు. ఈకార్యక్రమంలో పలువురు అధికారులు వారి వెంట ఉన్నారు.

## మరోసారి పోలీస్ కస్టడీకి కాకాణి

**నెల్లూరు క్రైమ్, జూన్ 25, ప్రభాతవార్త :** మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిని రెండు రోజుల పాటు పోలీస్ కస్టడీకి అనుమతిస్తూ కోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో బుధవారం పోలీసులు నెల్లూరు కేంద్ర కారాగారం నుండి కాకాణిని కృష్ణపట్నం పోర్టు పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. వెంకటాచలం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన అక్రమ గ్రావెల్ కేసులో ఈ మేరకు కస్టడీకి తీసుకున్నారు. మూడు కేసులలో నెల్లూరు సెంట్రల్ జైల్లో కాకాణి రిమాండ్ ఖైదీగా ఉన్నారు. అయన తరపు న్యాయవాదుల సమక్షంలోని పోలీసు విచారణ చేపట్టారు. గురువారం కూడా విచారణ చేపట్టనున్నారు.

## తెలంగాణ రాష్ట్ర దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ డైరెక్టర్‌గా మన నెల్లూరు వాసీ శ్రీ నరసింహులు



**నెల్లూరు, జూన్ 25, ప్రభాతవార్త-వైద్యం** తెలంగాణ రాష్ట్ర దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ డైరక్టర్‌గా పదవి బాధ్యతలు స్వీకరించారు. వారు కలువాయి మండలంలో జన్మించడం జరిగింది. వారు కల్లూరులో పదవ తరగతి వరకు చదువుకున్నారు. తరువాత నెల్లూరులోని కేపీసీ జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ వరకు చదివారు. తరువాత శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీలో ఇంజనీరింగ్ చదువుకున్నారు. తరువాత ఎలక్ట్రిసిటి బోర్డులో అసిస్టెంట్ ఇంజనీర్‌గా 1992లో జాయిన్ అయ్యారు. తరువాత అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్‌గా డివిజనల్ ఇంజనీర్, సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా, చీఫ్ ఇంజనీర్‌గా దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ తిరుపతిలో పని చేశారు. తరువాత రాష్ట్ర విభజనలో తెలంగాణ రాష్ట్రానికి వెళ్లడం జరిగింది. ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలోని దక్షిన ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ డైరక్టర్‌గా ఇవాళ పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నెల్లూరు జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ వి.విజయన్, జిల్లాలోని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్, డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్స్, అసిస్టెంట్ ఇంజనీర్స్, కార్మిక సంఘాలు, అసోసియేషన్‌లు వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.

## చేజర్ల గ్రామ దేవత అంకమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



**చేజర్ల జూన్ 25 ప్రభాతవార్త** మండలకేంద్రమైన చేజర్ల గ్రామంలో బస్టాండ్ అవరణంలో ఉన్న అంకమ్మ తల్లి గ్రామదేవతకు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉభయ దాతగా చేజర్ల టిడిపి మండల అద్యక్షులు షేక్.సిరాజుద్దీన్,ఉభయం జరిపించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి భజన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో ఆలయ కమీటి అద్యక్షులు బొగ్గవరపు సుధాకర్, దేవతి రమేష్‌బాబు,సుజనారెడ్డి, దేవతి సుబ్బారావు, మాదాల కమలేష్, నెల్లూరు సుజనారెడ్డి, బొగ్గవరపు తేజా గ్రామస్తులు పాల్గోన్నారు.

# గిరిజనులకు ఆధార్, రేషన్ కార్డులను ఇళ్ల వద్దకే వెళ్లి అందించేందుకు చర్యలు

- ఆగస్టు 15 లోపు జిల్లాలో గిరిజనులకు ఆధార్, రేషన్ కార్డులు..
- గిరిజనులకు ఆగిన పథకాలన్నీ పునరుద్ధరణ
- ఎస్టీ వర్గీకరణకు సంబంధించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుని వెళ్తాం
- రాష్ట్ర గిరిజన,స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి





**నెల్లూరు కలెక్టరేట్, జూన్ 25, ప్రభాతవార్త** బుధవారం జిల్లా పర్యటనకు విచ్చేసిన మంత్రి సంధ్యారాణి గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖలు అమలు చేస్తున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలను సమీక్షించారు. ఇటీవల అమానుష దాడిలో గాయపడి కోలుకుంటున్న చిన్నారిని హాస్పిటల్లో మంత్రి పరామర్శించారు. అనంతరం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సంధ్యారాణి మాట్లాడుతూ ప్రభుత్వం అందించే సంక్షేమ కార్యక్రమాలకు ఆధార్ కార్డు, రేషన్ కార్డు మూలాధారమని, మైదాన ప్రాంతమయినటువంటి జిల్లాలో ఇప్పటికీ అమాయక గిరిజనులకు ఆధార్ కార్డు, రేషన్ కార్డు లేకపోవడం భాధాకరమన్నారు. వెంటనే ఆధార్, రేషన్ కార్డులను వారి ఇళ్ల వద్దకే వెళ్లి అందించేందుకు చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులను ఆదేశించామన్నారు. అదేవిధంగా మారుమూల పల్లెల్లో త్రాగునీరు, సాగునీరు మోలిక వసతుల కల్పనయే ఐటీడీఏల ప్రథమ కర్తవ్యమన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో గిరిజన అభివృద్ధికి గత సంవత్సరం 1300 కోట్ల నిధులు వ్యయం చేశామన్నారు. అలాగే ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన పథకం ద్వారా 206 రోడ్లకు 550 కోట్ల నిధులు వ్యయం చేశామన్నారు. నెల్లూరు ఐటీడీఏ పరిధిలోని కావలి, తిరుపతి, కె.వి పల్లి తదితర ప్రాంతాల్లోని గురుకుల పాఠశాలల అభివృద్ధికి దాదాపు 18 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేశామన్నారు. గురుకుల పాఠశాలల్లోని 12 మంది విద్యార్థులు మెడికల్ సీట్లు, ఏడుగురు ఐఐటీలలో సీట్లు సంపాదించడం సంతోషకరమన్నారు. రాష్ట్రంలోని అన్ని గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో త్రాగునీటి కోసం ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేశామన్నారు. పేద గిరిజనులు వెనుకబడిన తెగలుగా మిగిలిపోకుండా వారిని అన్ని విధాలుగా ప్రోత్సహించి పైకి తెచ్చేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గత ప్రభుత్వం ఆపేసినటువంటి 16 గిరిజన సంక్షేమ పథకాలను పునరుద్ధరించామన్నారు. త్వరలోనే ముఖ్యమంత్రి స్థాయిలో నిర్ణయం తీసుకొని యానాదులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు.

**అంగన్వాడీలలో మేలైన పౌష్టికాహారం** జిల్లాలోని ఐసిడిఎస్ ద్వారా 12 ప్రాజెక్టులు అమలవుతున్నాయని, 3000 అంగన్వాడి సెంటర్ల లో బాలింతలకు, చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం, ఇతర పథకాలను సమీక్షించామన్నారు. బాల్య వివాహాలు జరగకుండా అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. పౌష్టికాహార లోపం ఉన్న వారిని గుర్తించి వారికి సరైన పోషకాహారం అందిస్తామన్నారు. రాష్ట్రంలోని ప్రతి అంగన్వాడిలలో మోలిక వసతుల అభివృద్ధి కోసం లక్ష రూపాయల నిధులు మంజూరు చేశామన్నారు. ప్రభుత్వ భవనాల్లో నడుస్తున్న అంగన్వాడీలకు ప్రథమ ప్రాధాన్యమిచ్చి మౌలిక వసతులను కల్పిస్తామన్నారు. రాష్ట్రంలోని 6800 మినీ సెంటర్‌లను మెయిన్ సెంటర్లుగా మార్చడంతో ప్రత్యేక టీచర్, ఆయాలను నియమిస్తున్నామన్నారు.

**మానవతా విలువలు మంటగలుస్తున్నాయి..** ఇటీవల జిల్లాలోని ఇందుకూరుపేట మండలంలోని ఓ గ్రామంలో అమానుష దాడికి గురై చికిత్స పొందుతున్న బాలికను మంత్రి పరామర్శించారు. 50వేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. చిన్నారి చదువుకు కావలసిన అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు. ఐసిడిఎస్ పిడి హేనా సుజన్, ఐటీడీఏ పిఓ మల్లికార్జున్ రెడ్డి పాల్గొన్నారు.

# సాంకేతిక పరిజ్ఞానంతో నేర పరిశోధన వేగవంతం ఐజి బి. రాజకుమారి



**నెల్లూరు క్రైమ్ జూన్ 25 ప్రభాతవార్త :** నేరాలు ఛేధించుటకు సాంకేతికత పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవడం ద్వారా దర్యాప్తు వేగవంతంగా ఏపీఎస్పీ బెటాలియన్స్ ఐజి బి. రాజకుమారి స్పష్టం చేశారు. నగరంలోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా పోలీసు అధికారులతో ఎస్పీ జీ. కృష్ణ కాంత్ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జూమ్ వీడియో కాన్ఫరెన్స్ (వర్చువల్) ద్వారా పర్యవేక్షించిన ఐజి మాట్లాడుతూ ముందు నెలల కన్నా గత నెల్లూరు జిల్లా మంచి పురోగతి సాధించిందని జిల్లా ఎస్పీని ప్రత్యేకంగా అభినందించారు. శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రనే లక్ష్యంగా పని చెయాలని, పెండింగ్ కేసుల సంఖ్య తగ్గించే దిశగా అన్ని స్థాయిల అధికారులు కృషి చేయాలని, ఎన్ఫోర్స్మెంట్‌ను పెంచాలని తెలిపారు. మిస్సింగ్ కేసుల ఛేదనకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డ్రోన్లు, సిసిటివి కెమెరాలు తదితర సాంకేతిక పరిజ్ఞానంతో నేర పరిశోధన నేర నియంత్రణ వేగవంతం చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకై తగు ముందస్తు చర్యలు తీసుకోవడంతో పాటు, ప్రమాదాలకు గల కారణాలపై విశ్లేషణ చేసి ప్రమాదాల కట్టడికి తగు రీతిలో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యాలయాలు ఓపెన్ అవుతున్న సందర్భంగా విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, స్వీయ రక్షణ, ఈవ్ టీజింగ్, ప్రేమ పేరుతో జరిగే మోసలపట్ల, సంరక్షించే చట్టాలపై అవగాహన కల్పించాలని, డయల్ 112 కాల్స్‌కు త్వరితగతిన సంఘటన స్థలానికి చేరుకొని బాధితులకు భరోసా కల్పించాలన్నారు. అంకితభావంతో విధులు నిర్వర్తిస్తూ సమర్థవంతమైన సేవల ద్వారా జిల్లా పోలీస్ శాఖకు మంచి గుర్తింపు తీసుకురావాలని సూచించారు. అనంతరం జిల్లాలో పెండింగ్‌లో ఉన్న గ్రేవ్ నాన్ గ్రేవ్ కేసులు, హత్య కేసులు, పిఓసిఎస్ఓ అండ్ రేప్ కేసులు, డెకాయిటి, రాబరీ, ప్రాపర్టీ, వాహనాలు దొంగతనం, మిస్సింగ్, చీటింగ్ కేసులు, ప్రాపర్టీ కేసులు, రోడ్డు ప్రమాదాలు, 174 సిఆర్.పిసి కేసులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ వర్క్, డిపిఓకు సంబంధించి పెండింగ్ రిప్లై ఫైల్స్, పెండింగ్ ఎన్‌బిడబ్ల్యూఎస్, ఎన్‌డిపిఎస్ కేసులలో దర్యాప్తు, రికవరీల గురించి సర్కిల్ వారీగా పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల కాలంలో నేర పరిశోధనలో ప్రతిభ కనబరిచిన పలువురు అధికారులను ఎస్పీ అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సమావేశంలో అడిషనల్ యస్.పి.(అడ్మిన్) సిహెచ్.సౌజన్య , లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులు రెడ్డి, ఎస్‌బి, రూరల్, కావలి, ఆత్మకూరు, కందుకూరు, ఉమెన్ పిఎస్, ఏఆర్ డిఎస్పిలు, ఇతర జిల్లా పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# రొట్టెల పండుగలో అత్యంత ప్రాధాన్యతగా పారిశుద్ధ్యం పనులు

## కమిషనర్ వై.ఓ నందన్





**నెల్లూరు కార్పొరేషన్,జూన్ 25 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన నెల్లూరు బారాషాహీద్ దర్గా రొట్టెల పండుగలో పారిశుధ్య నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత కల్పించి, ఏర్పాట్లను ప్రణాళికా బద్ధంగా చేపట్టాలని వివిధ విభాగాల అధికారులను కమిషనర్ వై.ఓ నందన్ సూచించారు.రొట్టెల పండుగ నిర్వహణపై సమీక్షా సమావేశాన్ని కార్పొరేషన్ కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రొట్టెల పండుగ పటిష్ట నిర్వహణకు వివిధ విభాగాల అధికారులు, సచివాలయ కార్యదర్శుల గత అనుభవాలను కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ జులై నెల 6వ తేదీ నుంచి ఐదు రోజుల పాటు జరగనున్న పండుగలో విధులను నిర్వహించాల్సిన సిబ్బంది జాబితాను సంసిద్ధం చేయాలని ఆదేశించారు. పండుగ ప్రారంభం నాటికి దర్గా ప్రాంగణంలో జోన్ల వారీగా విభాగాల ఏర్పాట్లు, మంచినీటి సదుపాయం, మున్సిపల్ సిబ్బందికి భోజన వసతి, హై మాక్స్ విద్యుత్ లైట్లు, తాత్కాలిక అంతర్గత దారుల నిర్మాణం, పారిశుధ్య నిర్వహణ, బ్లీచింగ్, సున్నం, మొబైల్ టాయిలెట్లు, బయో టాయిలెట్లు, రిసెప్షన్ సెంటర్ ఏర్పాటు, సి.సి కెమెరాలు, పార్కింగ్ ఏర్పాట్లు, మైక్ అనౌన్స్మెంట్, ఘాట్ ప్రాంతంలో షవర్ల ఏర్పాటు, రూట్ మ్యాప్‌ల ప్రదర్శన, బారికేడ్ల నిర్మాణం తదితర ఏర్పాట్లను పూర్తి చేయాలని సూచించారు. బారాషాహీద్ దర్గా సమీపంలోని హోటల్లు, కళ్యాణ మండపాల నిర్వాహకులతో మాట్లాడి వర్షం ప్రభావంతో అత్యవసరమైన సందర్భాల్లో భక్తులకు ఆశ్రయం కల్పించేందుకు సంసిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచనలు చేశారు. రొట్టెల పండుగ నిర్వహణలో గత ఏడాది జరిగిన లోపాలను గుర్తించి పునరావృతం కాకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, రొట్టెల పండుగ విశిష్టతను పెంచే విధంగా అన్ని సదుపాయాలను కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు చెప్పారు. ఈ సమావేశంలో నెల్లూరు నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం ఎస్.ఈ రామ్మోహన్ రావు, ఈ.ఈ శేషగిరిరావు, సిటీ ప్లానర్ హిమబిందు, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ చైతన్య, వెటర్నరీ డాక్టర్ మదన్ మోహన్, మలేరియా విభాగం అధికారి జిజియా బాయి, అన్ని విభాగాల అధికారులు, వార్డు సచివాలయ శానిటేషన్ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వైసీపీ పేరు ఇక రప్పా రప్పా పార్టీ.. ఎన్నికల గుర్తు గొడ్డలి

- సైకో మనస్తత్వం కలిగిన జగన్‌రెడ్డి పార్టీకి అవే కరెక్ట్
- దళిత సోదరుడు సింగయ్యది జగన్‌రెడ్డి చేసిన హత్యే
- జాతీయ ఎస్సీ కమీషన్ జోక్యం చేసుకుని చర్యలు తీసుకోవాలి
- ఊళ్లోళ్ల ప్రాణాలు తీసేసే వ్యక్తికి ప్రాణభయమనడం విడ్డూరమే
- నెల్లూరు టీడీపీ జిల్లా కార్యాలయంలో మీడియాతో పొలిట్ బ్యూరో సభ్యులు, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



**నెల్లూరు, జూన్ 25,ప్రభాతవార్త-వైద్యం** దళిత సోదరుడు సింగయ్యది జగన్‌రెడ్డి చేసిన హత్యే. పోలీసు ఆంక్షలను ఉల్లంఘించి చేపట్టిన ర్యాలీలో సింగయ్య మెడను కారు కింద నలిపేశారు. సాటి మానవుడి ప్రాణం పోతుందనే కనికరం కూడా లేకుండా సింగయ్య శరీరాన్ని లాగి పక్కన పడేశారు. జగన్‌రెడ్డి కార్యక్రమానికి పోలీసులు అనుమతి ఇచ్చింది రెంటపాళ్ళలో అది కూడా 3 కార్లు వంద మందికి. 9 గంటల సేపు 80 కిలోమీటర్ల మేర ర్యాలీ నిర్వహించి ముగ్గురు ప్రాణాలను బలితీసుకున్నాడు. రెంటపాళ్లకు వెళ్లింది, బెట్టింగ్‌లో నిండా మునిగిపోయి ఆత్మహత్య చేసుకున్న నాగమల్లేశ్వర రావు కుటుంబాన్ని పరామర్శించేందుకు. 2024 జూన్ 9 న జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉన్న సమయంలోనే ఆయన ప్రాణాలు తీసుకున్నారు. వైనాట్ 175 అని జగన్ పలికిన ప్రగల్భాలను గుడ్డిగా నమ్మి బెట్టింగ్‌లు కట్టి నష్టపోయాడు. నాగమల్లేశ్వరరావు ఆత్మహత్యకు కారణంకూడా జగన్‌రెడ్డే. బెట్టింగ్‌లో నష్టపోయి ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి విగ్రహాన్ని ఆవిష్కరించేందుకు మాజీ సీఎం వెళ్లడం కంటే దుర్మార్గం మరొకటి లేదు. గంగమ్మ జాతరలో పోతును నరికినట్లు టీడీపీ కార్యకర్తలను రప్పా రప్పా నరికేస్తామనడం తప్పు కాదని సమర్థించుకోవడం జగన్‌రెడ్డి లాంటి సైకోకే చెల్లింది. వైసీపీ పేరు మార్చి రప్పా రప్పా పార్టీ అని పెట్టుకోవాలి, ఎన్నికల గుర్తుగా గొడ్డలిని మార్చుకోవాలని హితవు పలికారు. దళితుల ప్రాణాలు బలితీసుకోవడం వైసీపీ నాయకులకు మొదటి నుంచి ఆలవాటే. గంతలో డాక్టర్ సుధాకర్, డ్రైవర్ సుబ్రహ్మణ్యం, ఉదయగిరి నారాయణ, దుగ్గిరాల కరుణాకర్, ఇప్పుడు సింగయ్యతో పాటు మరొకరు. ఏ రోజు దళిత కుటుంబాలను జగన్‌రెడ్డి కానీ, వైసీపీ నాయకులు కానీ ఎందుకు పరామర్శించలేదని అన్నారు. బెట్టింగ్‌లో నష్టపోయిన వ్యక్తి కుటుంబాన్ని పరామర్శించే పేరుతో ర్యాలీ నిర్వహించి మూడు ప్రాణాలు బలి తీసుకున్నాడన్నారు. సింగయ్యతో పాటు మరొకరు కార్ల కింద పడి చనిపోతే మరొకరు అంబులెన్స్‌లో వెళ్తూ ట్రాఫిక్‌లో చిక్కుకుని సకాలంలో వైద్యం అందక ప్రాణాలు కోల్పోయాడు. జగన్‌రెడ్డి కారులో ఆయనతో పాటు డ్రైవర్, పీఏ, సీనియర్ వైసీపీ నాయకులు కూడా ఉన్నారు. మరో వాహనంలో ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేయకుండా రోడ్డు పక్కన చెట్లలోకి లాగేయడం దుర్మార్గం. జాతీయ ఎస్సీ కమీషన్ వెంటనే ఈ ఘటనలో జోక్యం చేసుకోవాలి, జగన్ రెడ్డి లాంటి వ్యక్తులకు దళితులు, గిరిజనుల ప్రాణాలంటే లెక్కలేకుండా పోతోంది. జెడ్ ప్లస్ కేటగిరి భద్రతలో ఉండే చంద్రబాబునాయుడుపై పుంగనూరులో రాళ్లు వేయించాడు. రాళ్లు వేయడమే కాక చంద్రబాబు నాయుడుతో పాటు వందల మంది టీడీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించాడన్నారు. ప్రతి గ్రామంలో పదుల సంఖ్యలో టీడీపీ కార్యకర్తలు జైళ్లకు పోవడం, ఊళ్లు వదిలిపెట్టి పోవడం జరిగిందన్నారు. యువగళం పాదయాత్రలో లోకేష్‌బాబును చిత్రహింసలు పెట్టారన్నారు. ఎంపీ రఘురామకృష్ణమరాజుపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి వీడియో కాల్‌లో చూసి పైశాచిక ఆనందం పొందగా, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డిపై గ్రావెల్ దొంగతనం కేసు పెట్టించారన్నారు. ఇలాంటి ఎన్నో దుర్మార్గాలు చేసిన వైసీపీ పేరుతో పాటు ఎన్నికల గుర్తు కూడా మార్చేయాలన్నారు. మద్యం స్కాముల్లో జరిగిన అక్రమాల విలువ అధికారికంగా రూ.3200 కోట్లు అయితే అనధికార విక్రయాలతో కలిపి స్కామ్ విలువ రూ.10వేల కోట్లపైనే అన్నారు. తండ్రి సీఎంగా ఉన్నప్పుడు అధికారాన్ని అడ్డుపెట్టుకుని జగన్‌రెడ్డి రూ.43 వేల కోట్లు దోపిడి చేసి 13 సీబీఐ కేసుల్లో ముద్దాయిగా ఉన్నాడన్నారు. ఢిల్లీలో రూ.150 కోట్లలోపు మద్యం స్కాముకే సీఎం, డిప్యూటీ సీఎం, పలువురు ఎంపీలు, ప్రజాప్రతినిధులు, కీలక నేతలు, నెలల తరబడి జైళ్లకు వెళ్లారు. లిక్కర్ స్కామ్‌లో వెలుగు చూస్తున్న నిజాలు చూస్తే సిట్ అధికారులకే మైండ్ బ్లాక్ అవుతోందన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఊటింగ్, డిస్టలరీల స్వాధీనం, విదేశీ అకౌంట్లు, బంగారు నగలు వజ్రాలు లావాదేవీలు వెలుగులోకి వస్తున్నాయన్నారు. సన్సేషనల్ కరప్షన్ కేసు అయిన లిక్కర్ స్కామ్ డైవర్షన్ కోసమే రోజు ప్రెస్‌మీట్లు పెట్టి జగన్ హడావుడి చేస్తున్నాడన్నారు. రాష్ట్రం సజావుగా నడవడం అభివృద్ధి చెందడం జగన్‌రెడ్డికి సాక్షికి ఇష్టం లేదన్నారు. కాకులు, కోతులు చనిపోయినప్పుడు వందల కొద్ది కాకులు, గుంపులుగా కోతులు అక్కడకు చేరుకుని మూగవేదన అనుభవిస్తాయన్నారు. కనీసం పక్షులు, జంతువులకు ఉన్నంత జాలి, దయ కూడా జగన్ రెడ్డితో పాటు వైసీపీ నాయకులకు లేకుండా పోయాయన్నారు. ఇలా క్రూరంగా ప్రవర్తించే వారి గురించి ఎక్కడో పత్రికల్లో వార్తలు చదువుతుంటాం, వైసీపీ నాయకుల ముందు వారికి డిపాజిట్లు కూడా దక్కేలా లేవు అన్నారు. ముగ్గురు ప్రాణాలు పోతే ప్రెస్ మీట్లు పెట్టే జోకులేస్తున్నాడు.. సైకో మనస్తత్వం కలిగిన వారికే ఇలాంటివి సాధ్యమవుతాయన్నారు.

## ప్రమాదకర పరిశ్రమల మాక్ డ్రిల్ బేష్



**నెల్లూరు అగ్రికల్చర్, జూన్ 25, ప్రభాతవార్త :** వెంకటాచల మండలం గొలగమూడిలోని ఎనర్గాన్ పెట్రో ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కర్మాగారంలో ప్రమాదాల నివారణపై మాక్ డ్రిల్ నిర్వహించారు. ప్రమాదకర రసాయనాల కర్మాగారాల నిర్వహణ ప్రతినిధులు, సంక్షోభబృందం సభ్యులు సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ మాక్ డ్రిల్‌ను నెల్లూరు ఆర్డీఓ నాగసంతోష అనూష పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ అనూష మాట్లాడుతూ రసాయన పరిశ్రమల్లో ఊహించని ప్రమాదాలు జరిగినప్పుడు వాటిని సమర్థవంతంగా ఎదుర్కొనే ప్రక్రియలో భాగంగా ఏర్పాటు చేసిన మాక్ డ్రిల్, పరిశ్రమల నిర్వహణ ప్రతినిధుల పనితీరుకు అద్దం పట్టిందన్నారు. పరిశ్రమల్లో పని చేసే కార్మికుల్ని పరిసర ప్రాంతాల ప్రజల్ని తక్షణం కాపాడగలరు అన్న నమ్మకం కల్పించారని అన్నారు.

## పల్లెలో ఎమ్మార్పీఎస్ జెండా ఎగురవేద్దాం

– మంద వెంకటేశ్వరరావు మాదిగ



**వింజమూరు, జూన్ 25, ప్రభాతవార్త :** మహానేత పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ప్రతి మాదిగ పల్లెలో జులై 7వ తేదీన ఎమ్మార్పీఎస్ జెండా ఎగరవేయాలని ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ జిల్లా ఇన్‌ఛార్జీ మందా వెంకటేశ్వర మాదిగ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని మాదవ్ నగర్ గ్రామంలో ఎంఎస్పీ మండల ఇన్‌ఛార్జీ గోచిపోతుల ఆనందరావు, కోఇన్‌ఛార్జీ మొలబంటి సుధాకర్ మాదిగ ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి ముఖ్య అతిధులుగా జిల్లా ఇన్‌ఛార్జీ అధ్యక్షులు మంద వెంకటేశ్వరరావు ఎంఎస్ప జిల్లా అధ్యక్షులు ఉదయగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ పందిటి అంబేద్కర్ మాదిగ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఏర్పాటు చేసిన జులై 7 నాటికి 30 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండా గ్రామ గ్రామాన ఎగరవేయాలని మాదిగల ఆత్మగౌరవ పతాకాన్ని ఎగరవేయాలని అలాగే చదువుకున్న యువకులు ఎమ్మార్పీఎస్ కమిటీలో భాగస్వామి కావాలని కోరారు. ఎస్సీ వర్గీకరణతో పాటు సమాజంలో అన్ని వర్గాల కోసం పాటుపడిన చరిత్ర ఎంఆర్పీఎస్ ఉద్యమ నేత మంద కృష్ణ మాదిగకు ఉందని మాదిగలకే కాకుండా వికలాంగుల వృద్దులు వితంతువుల పెన్షన్ పెంపులో కీలక భూమిక ఎమ్మార్పీఎస్ ఉద్యమది అన్నారు. ప్రతి మాదిగ పల్లెలో జెండా దిమ్మెలు నిర్మాణం చేపట్టి జులై 7వ తేదీన ఒక పండుగ వాఆవరణంలా ప్రతి మాదిగ పల్లెల్లో జెండా ఆవిష్కరణలు జరగాలని సూచించారు. అనంతరం వెంకనపాలెం గ్రామంలో ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ గ్రామ కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది. ఎమ్మార్పీఎస్ గ్రామ అధ్యక్షులు నందిపాటి రవీందర్‌మాదిగ, గ్రామ ఉపాధ్యక్షులు మొలబంటి రఘుమాదిగ, గ్రామ ప్రధాన కార్యదర్శి మొలబంటి జీవా మాదిగ, ఎంఎస్పీ గ్రామ కమిటీ గ్రామ అధ్యక్షులు మొలబంటి మాల్యాద్రి మాదిగ, గ్రామ ఉపాధ్యక్షులు మొలబంటి శ్రీనివాస్ మాదిగ, గ్రామ ప్రధాన కార్యదర్శి మొలబంటి వెంకటేశ్వర్లు మాదిగ, గ్రామ కోశాధికారి మొలబంటి నాగయ్య మాదిగలను నియమించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ నాయకులు గంగపట్ల నాగరాజు మాదిగ, గంగపట్ల వెంగళరావు మాదిగ, దండు మస్తాన్ మాదిగ, మంగళ కిశోర్ మాదిగ, గ్రామంలో పెద్దలు, యువకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## బదిలీ అయిన ప్రధానోపాధ్యాయులుకు సన్మానం



**బిట్రగుంట జూన్ 25 ప్రభాతవార్త:** బోగోలు మండలం విశ్వనాధరావుపేట జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ ఆల్లిపురం ఉన్నత పాఠశాలకు బదిలీపైన వెళ్లిన ప్రధానోపాధ్యాయులు రవీంద్రనాథ్ ఠాగూర్ ను బుధవారం గ్రామ సర్పంచ్, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయ సిబ్బంది సన్మానం చేశారు. విధి నిర్వహణలో నిబద్ధత తో పనిచేసి ఉత్తమ సేవలు అందించారని వారు ఈ సందర్భంగా కొనియాడారు. ఈ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ గందూరి మంజుల దంపతులుతో పాటు కావలి ఉప విద్యాశాఖధికారి హరిప్రసాద్, ఎంఈఓలు నరసింహారావు జయమ్మ, ప్లస్ టూ ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ గంగాధర్, పాఠశాల ఎస్ఈసి చైర్మన్ రవికుమార్, స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు గోవా. శైలజ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సింహాద్రి రావుకు ప్రపంచ బుక్ ఆప్ రికార్డ్ అవార్డ్ ప్రదానం



**బిట్రగుంట జూన్ 25 ప్రభాతవార్త:** బోగోలు మండలం భవాని ఎడ్యుకేషనల్ సొసైటీ స్వచ్ఛంద సేవాసంస్థ డైరక్టర్ డాక్టర్ కట్టిపల్లి సింహాద్రి రావు కు ప్రపంచ బుక్ రికార్డ్ వారు అవార్డ్ కు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆ సంస్థ ప్రసిడెంట్ రిషీకుమార్ ఈమెయిల్ సందేశం ద్వారా సింహాద్రిరావుకు సమాచారం పంపారు., అవార్డ్ కు ఎంపికైనా సింహాద్రి రావు మాట్లాడుతూ తాను 3 దశాబ్దాల పాటు హెచ్ ఐ వి /ఎయిడ్స్ అనాధలకు చేసిన సేవలు గుర్తించి ప్రపంచ బుక్ రికార్డ్ ఢిల్లీ వారు అవార్డ్ ప్రకటించినందుకు,ప్రపంచస్థాయి లో గుర్తింపు ప్రకటించినందుకు ప్రపంచ బుక్ రికార్డ్ సంస్థ వారికి ధన్యవాదాలు తెలిపారు.

## ముందుగ దివ్యాంగులకు రేషన్ పంపిణి చేయండి



**జలదంకి, జూన్25, ప్రభాతవార్త :** ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జులై నెలకు సంబంధించి రేషన్ సరకులు వృద్దులు,దివ్యాంగులకు ముందుగ పంపిణిచేయాలని తహసిల్‌దార్ ప్రమీల ఆదేశించారు.బుధవారం స్థానిక కార్యాలయంలో మండలంలోని రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు.ఈసందర్బంగ తహసిల్‌దార్ స్పష్టమైన సూచనలిచ్చారు. వృద్దులు, వికలాంగు లకు ఈనెల 26నుంచే వారి నివాసాలవద్దకు వెళ్ళి సరకులు అందించాలన్నారు.ఈప్రక్రియ 30వరకు కొనసాగాలన్నారు.అలాగే జులై 1నుంచి చేపట్టే రేషన్ పంపిణి ప్రతి వక్కరు నిర్దేశించిన సమయాలలో ఖచ్చితత్వం పాటించాలని తెలిపారు.ఉదయం 8గంటనుంచి మద్యాహ్నం 12వరకు,సాయంత్రం 4నుంచి 8గంటల వరకు తప్పక సరకులు ఇవ్వాలని చెప్పారు.ఎక్కడ ఎలాంటి పొర పాట్లు దొర్లకుండ పకడ్బందిగ వ్యవహరించాలనితెలియజేశారు.అనంతరం అందరితో పరిచయం కార్యక్రమం స్నేహపూర్వక వాతావరణంలో చేపట్టారు.డిప్యూటి తహసిల్‌దార్ జులియాబాయిని డీలర్లు శాలువాలతో ఘనంగా సన్మానించారు.

## శివయ్య భూములు వేలంపాటలు

**కలిగిరి, జూన్25, ప్రభాతవార్త;** కలిగిరి మండలం వెలగపాడు లోని శ్రీపార్వతీ పరమేశ్వరస్వామి ఆలయ భూములు ఒక సంవత్సరం లీజునకు వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త శ్రీకంటి వెంకట రామక్రిష్ణ ఓ ప్రకటనలో తెలిపారు.వెలగపాడులోని ఆలయ భూములు 2025;2026 సంవత్సరం(ఒక సంవత్సరం)లీజునకు ఇవ్వడం జరుగుతుందన్నారు. భూములు పాడుకోదలచిన వారు ఒక్కోరైతు రు. 2000ల రూపాయలు దరావతు చెల్లించి పాటలో పాల్గొన వచ్చన్నారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ వారు ఆద్వర్యంలో జరుగు ఈ వేలంపాటలో 26వ తేదీ ఉదయం 11గంటలకు వేలంపాటలు పాల్గొనాల్సి ఉందన్నారు.

## బుచ్చి రిపోర్టర్ రఫీ మృతి



**బుచ్చి జూన్ 25 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెంకి చెందిన మహ్మద్ రఫీ అనే రిపోర్టర్ బుధవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు.ఆయన ప్రజాతీర్పు ఎడిటర్‌గా, స్వంతంగా యూట్యూబ్ చానల్ కూడా నిర్వహిస్తున్నారు. విషయం తెలుసుకొని పలువురు రిపోర్టర్లు,పలు పార్టీల నాయకులు ఆయన మృతదేహాన్ని సందర్శించి వారి కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలి



**బుచ్చి జూన్ 25 ప్రభాతవార్త :** సచివాలయ సిబ్బంది తప్పకుండా సమయపాలన పాటించాలని లేకపోతే చర్యలు తప్పవని ఎంపిడిఓ ఎం.నారాయణరెడ్డి సూరించారు. సచివాలయ సిబ్బంది విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే మెమోలు తప్పవని హెచ్చరించారు. ప్రజలకు ఎల్ల వేళలా అందుబాటులో ఉండాలని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమపథకాల వివరాలు ఎప్పటికప్పటు తెలియజేయాలని అన్నారు. ప్రజలకు ఓపికతో సమాధానం చెప్పాలని విధినిర్వహణ చిత్తశుద్దితో చేయాలని అన్నారు.

## చీకటి అధ్యాయానికి యాభై సంవత్సరాలు




**కావలిరూరల్, జూన్25 ప్రభాతవార్త :** కాంగ్రెస్ విధించిన అత్యవసర పరిస్థితి చీకటి అధ్యాయానికి 50 సంవత్సరాలు పూర్తయ్యాయని పలువురు బిజెపి నాయకులు తెలిపారు. భారతీయ జనతాపార్టీ కావలి పట్టణశాఖ ఆధ్వర్యంలో పట్టణ అధ్యక్షులు మందా కిరణ్ కుమార్ అధ్యక్షతన బుధవారం పట్టణంలోని శ్రీ వశిష్ఠ జూనియర్ కళాశాల నందు కాంగ్రెస్ విధించిన అత్యవసర పరిస్థితి చీకటి అధ్యాయానికి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సెమినార్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భారతీయ జనతాపార్టీ కిసాన్‌మోర్చ జాతీయ ఉపాధ్యక్షులు సన్నపరెడ్డి సురేష్‌రెడ్డి, ఎమర్జెన్సీ డే కార్యక్రమం కన్వీనర్ గుప్తా అశోక్‌నాయుడులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడారు. దేశంలో ఎమర్జెన్సీ విధించి 50యేళ్లు పూర్తయిన సందర్భంగా నాటి చేదు ఘటనలను ఆ చీకటి రోజులపై నేటి తరానికి తెలియచేసే లక్ష్యంతో భారతీయ జనతాపార్టీ ఆంధ్రప్రదేశ్ పిలుపుమేరకు అవగాహన సదస్సును నిర్వహించడం జరిగిందని తెలిపారు. దేశంలో ఎమర్జెన్సీ సమయంలో అప్పటి కాంగ్రెస్ ఇష్టానుసారంగా వ్యవహరించి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిందని తెలిపారు. ఎమర్జెన్సీ పేరుతో కాంగ్రెస్ వ్యవహరించిన నియంతృత్వధోరణి, నాటి అమానుష ఘటనలను నేటి యువతరానికి, ప్రజలకు తెలియచేయానే ఉద్దేశంతో భారతీయ జనతాపార్టీ ఆధ్వర్యంలో అవగాహనసదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. 21 నెలల పాటు కొనసాగిన ఎమర్జెన్సీ కాలంలో లక్షలాదిమంది జైలుపాలయ్యారని, అసలు దేశమే ఒక జైలుగా మారిందని తెలిపారు. ఎమర్జెన్సీ కాలంలో ప్రశ్నించిన ప్రతి ఒక్కరూ జైలు పాలయ్యారని తెలిపారు. స్వాతంత్ర్య భారతదేశ చరిత్రలో ఎమర్జెన్సీ ఒక చీకటి ఘటన అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్రసహ కోశాధికారి, కందుకూరి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత, కందుకూరి వెంకటసత్యనారాయణ, రాష్ట్రకార్యవర్గ సభ్యులు గుండ్లపల్లి భరత్‌కుమార్‌యాదవ్, అంచిపాక కమల, జిల్లా టెలికాం అడ్వైజరి కమిటి సభ్యులు కట్టుబోయిన బ్రహ్మానందం, అసెంబ్లీ కన్వీనర్ సివిసి సత్యం, ఎస్సీ మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షులు పరుసు వెంకటేశ్వర్లు, రాష్ట్రకౌన్సిల్ సభ్యులు వింతా రంగారెడ్డి, ఎస్సి మోర్చ జిల్లా కార్యదర్శి మందా శ్రీనివాసులు, సీనియర్ నాయకులు పల్లపు చిట్టిబాబు, తదితర బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉండాలి: డాక్టర్ మేఘనాథ్ చౌదరి



**కావలిరూరల్, జూన్25 ప్రభాతవార్త :** మాతృ, శిశుమరణాలు జరగకుండా పౌష్ఠికాహారం తీసుకుంటూ వ్యాధినిరోధకశక్తిని పెంచుకుని తల్లి, బిడ్డా ఆరోగ్యంగా ఉండాలని రక్తహీన తలేకుండా ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మని వ్వాలని కావలి వైకుంఠపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మేఘనాథ్‌చౌదరి తెలిపారు. కావలి వైకుంఠపురం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో డాక్టర్ రామ్‌సెంటర్ సహకారంతో కావలి పెంకులఫ్యాక్టరి గిరిజనకాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం గర్భవతులకు ఇమ్యూనైజేషన్, ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అనంతరం డాక్టర్ రామ్‌సెంటర్ వారు ఐరన్, పాలిక్, కాల్షియం సిరప్‌లు పంపిణి చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ రామ్‌సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహర్‌రెడ్డి, డైరక్టర్ కూనం తాతిరెడ్డి, సామాజిక కార్యకర్త ఎం.మాలకొండారెడ్డి, పిహెచ్‌సి కమ్యూనిటి ఆర్గనైజర్లు చెన్నకేశవులు, సునీత, ఎఎన్ఎమ్ రత్నకుమారి, ఆశాకార్యకర్త మోహిన్, అంగన్‌వాడి టీచర్ శారత, గర్భవతులు, బాలింతలు, స్థానికులు పాల్గొన్నారు.

## కావలి సబ్‌రిజిష్ట్రసార్ కార్యాలయంలో నోటరీ స్టాంప్‌లు ఏర్పాటు చేయాలి



**కావలిరూరల్, జూన్25 ప్రభాతవార్త :** కావలి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో వెంటనే నోటరీ స్టాంప్‌లను ఏర్పాటు చేయాలని బుధవారం కావలికి విచ్చేసిన జిల్లా రిజిస్ట్రార్ ఎ.బాలాంజనేయులుకు కావలి న్యాయవాదులు వినతిపత్రాన్ని అందచేయడం జరిగింది. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడారు. ప్రతి విద్యా సంస్థల్లో చదివే విద్యార్థులకు బయోడేటాను ఆన్‌లైన్ చేస్తున్నందున అటువంటి సమయంలో అడ్రస్ మార్పు, చేర్పులు, పేరు సవరణ సమర్పించే సమయంలో నోటరీని ప్రామాణికంగా తీసుకుంటున్నారని తెలిపారు. దీనికి నోటరీ స్టాంపులు చాలా అవసరమని తెలిపారు. ప్రజలకు, న్యాయవాదులకు, న్యాయవాదుల గుమస్తాలకు ఒకటి, రెండు, ఐదు, పది, ఇరువై రూపాయల స్టాంపులు అధికసంఖ్యలో అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఏదైనా సమాచారంకోసం కాని, అప్లికేషన్‌లకు కాని, కోర్టునందు బత్తాలు లేదా ప్రాసెస్ ఫీజు కట్టాలంటే నోటరీ స్టాంపులు లభించక ఇబ్బందులు పడుతున్నారని తెలియచేశారు. తక్షణమే కావలి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో నోటరీ స్టాంప్‌లు ఎక్కువమొత్తంలో అందించి కొరత తీర్చాలని తెలిపారు. త్వరితగతిన కార్యాలయాల్లో నోటరీస్టాంప్‌లను అందించాలని కోర్టుఫీజు స్టాంపులు, రిజిస్ట్రర్ కార్యాలయంలో అందించక బ్యాంకు రుణాలు మరియు ఇతర రుణాలు పొందేందుకు చిన్నచిన్న డాక్యుమెంట్లు తయారు చేయడంలో కోర్టుఫీజు స్టాంపులు ముఖ్య అవసరమని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఐ.సాయిప్రసాద్, కె.చంద్రశేఖర్‌రెడ్డి, న్యాయవాద గుమస్తాలు కె.నాగరాజు, ఎం.శివకుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఎంపిడిఓకి వినతి



**బుచ్చి జూన్ 25 ప్రభాతవార్త :** సచివాలయాలలో పనిచేస్తున్న ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఎంపిడిఓ ఎం.నారాయణరెడ్డికి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్బంగా వారు మాట్లాడుతు ప్రభుత్వం స్పష్టతలేని నిబంధనలు పెట్టడం వలన అయోమయ స్దితిలో పడిపోయామని వారు ఆందోళన వ్యక్తం చేశారు. మండల స్దాయి అధికారులు తమ సమస్యలను ఉన్నతాదికారులకు తెలియ జేయాలని వారు ఎంపిడిని కోరారు. ఈకార్యక్రమంలో జిల్లా అసోసియేటేడ్ ప్రెసిడెంట్ పల్లవరం హరికృష్ణా,జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ అత్తూరీ శివాజి, మండల ప్రెసిడెంట్ సొంగ హరికృష్ణా, మండల జనరల్ సెక్రటరీ పాలకూరు నందిని, మండల ట్రెజరర్ చింతాల వెంకటేష్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తువ్వార అకిల్, తుపాకుల శ్రీకాంత్, గాలి చందుష్, కొప్పెలు పూజిత, షేక్ షయాజ్, బాను ప్రకాష్, సాయిరామ్ తదితరులు పాల్గోన్నారు.

## పొదుపు మహిళా బ్యాంకులో నిధులపై విచారణ

– ఆర్డీ, ఎఫ్‌డీలపై ప్రత్యేక దృష్టి



**కోవూరు, జూన్25 ప్రభాతవార్త :** కోవూరు మండలం లేగుంటపాడు గ్రామంలోని పొదుపు లక్ష్మి మహిళా బ్యాంకులో ఇటీవల కాలంలో ఫిక్స్‌డ్ డిపాజిట్‌లు, రికరింగ్ డిపాజిట్లు చేసిన ఖాతాదారులకు సంవత్సరం కావస్తున్నా నిధులు ఇవ్వని విషయమై సంబంధిత ఖాతాదారులు ఇటీవల జిల్లా కలెక్టర్‌కు గ్రీవెన్స్‌డేలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ఈ నిధుల విషయమై సహకార శాఖలో పనిచేస్తున్న ఎస్‌డీఎల్‌సీవో సుభాషిణిని విచారణ అధికారిగా నియమించారు. ఈ మేరకు ఆమె బుధవారం లేగుంటపాడులోని పొదుపు లక్ష్మి మహిళా బ్యాంకులో పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లేగుంటపాడు గ్రామానికి చెందిన సుజాతమ్మ సంవత్సరం క్రితం తన ఆర్‌డీ పూర్తి అయినా నేటికీ ఇవ్వలేదని జిల్లా కలెక్టర్‌కు గ్రీవెన్స్‌డేలో ఫిర్యాదు చేశారు. అదే విధంగా వెంకటసుబ్బయ్య అనే ఖాతాదారుడు తాను ఈ బ్యాంకులో ఐదు ఆర్‌డీలు, నాలుగు ఎఫ్‌డీలు చేశానని, మొత్తం తనకు 13.50 లక్షలు రావాలని గ్రీవెన్స్‌డేలో ఫిర్యాదు చేశారు. వీరిరువురి ఫిర్యాదుపై బుధవారం నిశిత పరిశీలన చేపట్టడం జరిగిందన్నారు. మహిళా బ్యాంకు సీఈవో తనకు వివిధ ఖాతాదారుల నుంచి 2.5 కోట్లు రావాల్సి ఉందని ఈ సందర్భంగా తనకు తెలియజేశారన్నారు. ప్రస్తుతం సుజాతమ్మకు 2.35 లక్షలు, వెంకటసుబ్బయ్యకు 13.50 లక్షలు మహిళా బ్యాంకు ద్వారా రావాల్సి ఉందన్నారు. మహిళా బ్యాంకు సీఈవో ప్రసాద్‌రెడ్డి వీరిరువురికి మూడు రోజుల లోగా వారికి ఇవ్వాల్సిన మొత్తాన్ని ఇవ్వడం జరుగుతుందని చెప్పారన్నారు. ఈ మేరకు పూర్తి నివేదికను తయారు చేసి జిల్లా కలెక్టర్‌కు అందజేయడం జరుగుతుందన్నారు. మొత్తం మహిళా బ్యాంకు సంబంధించి ఇంకా అనేక మందికి ఆర్‌డీలు, ఎఫ్‌డీలు ఇవ్వాల్సి ఉందని వారు కూడా సోమవారం గ్రీవెన్స్‌డేలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమైనట్లు సమాచారం. మొత్తం మీద ఈ మహిళా బ్యాంకుపై జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తే అనేక సంఘటనలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

## ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించిన కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి



**నెల్లూరు రూరల్, జూన్ 25, ప్రభాతవార్త :** నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని సౌత్ మోపూర్ గ్రామంలో శంకర నేత్రాలయ కంటి వైద్యశాల, చెన్నై కాటంరెడ్డి ప్రసాద్ రెడ్డి, శోభారెడ్డి సౌజన్యంతో ఉచిత కంటి శుక్లం శస్త్ర చికిత్స శిబిరాన్ని టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి ప్రారంభించారు. రూరల్ నియోజకవర్గంలో సౌత్ మోపూర్ గ్రామం నందు ఏడు రోజుల పాటు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి చికిత్స అందిస్తున్న శంకర నేత్రాలయ చెన్నై యాజమాన్యానికి, వైద్యులకు మరియు కాటంరెడ్డి ప్రసాద్ రెడ్డి, కాటంరెడ్డి శోభా రెడ్డికు నెల్లూరు రూరల్ ప్రజలు పక్షాన నా ప్రత్యేక ధన్యవాదములు. టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్ష మేరకు ప్రతి ఒక్కరికి కూడా మెరుగైన వైద్యం అందించాలని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి నారా లోకేష్ ఆరోగ్య రక్ష కార్యక్రమాన్ని నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ఇప్పటికే అనేక ప్రాంతాలలో వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న నారా లోకేష్ ఆరోగ్య రక్ష కన్వీనర్ దాట్ల చక్రవర్ధన్ రెడ్డికి నా అభినందనలు. టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి నెల్లూరు రూరల్ నియోజకవర్గ ప్రజలందరూ సౌత్ మోపూర్ గ్రామంలో ఈనెల 30వ తేదీ వరకు నిర్వహించే ఉచిత కంటి శుక్లం శస్త్ర చికిత్స శిబిరంలో కంటి పరీక్షలు చేయించుకొని ప్రజలందరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు ఇందుపూరు శ్రీనివాసులు రెడ్డి, మండల పరిషత్ అధ్యక్షుడు బూడిద విజయ్ కుమార్ యాదవ్, నెల్లూరు రూరల్ మండలం ఎమ్మెల్యే కార్యాలయం ఇంచార్జ్ వేమిరెడ్డి సురేందర్ రెడ్డి, టిడిపి మండల కన్వీనర్ పముజుల ప్రదీప్, మండల కో ఆప్షన్ నెంబర్ మీరా మొహిద్దిన్, టిడిపి నాయకులు రాపూరు శేఖర్, చెన్నారెడ్డి సురేందర్ రెడ్డి, చెన్నారెడ్డి శ్రీనివాసులు రెడ్డి, మనవరపు భాస్కర్, అన్నం సుధాకర్ గౌడ్, తుళ్లూరు రామయ్య, ఆరెద్దల మణి, టి. కామాక్షయ్య, సాదేపల్లి విజయభారత్ బి.గోపాలయ్య, అంకయ్య, గిరి, మస్తాన్, ప్రవీణ్, మనవరపు నరసయ్య, సునీల్, ఉబ్బల పెంచలయ్య, దబ్బుగుంట వెంకటేశ్వర్లు, రాపూరు కాలయ్య, ఉంటా శివయ్య, శివ,పెళ్లూరు గంగాధర్ ఉంటా శివరామ్, రాపూరు తిరుపాలు, అనూఫ్, తిరుపాలు, ఆలకుంట శీను, బొప్పరాజు మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

## బిఎంఆర్ ఆధ్వర్యంలో భక్తులకు అన్న ప్రసాదాలు పంపిణీ



**విడవలూరు, జూన్ 25, ప్రభాతవార్త :** రామతీర్థం గ్రామంలో వెలసియున్న కామాక్షి సమేత రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం బి ఏం ఆర్ చారిటబుల్ ఆధ్వర్యంలో భక్తులకు అన్న ప్రసాదం, మజ్జిగ పంపిణీ కార్యక్రమం సంస్థ డైరెక్టర్ దొడ్ల వేణుగోపాల్ రెడ్డి చేతుల మీదుగా భక్తులకు అందజేశారు. సుమారు ఐదువేల మజ్జిగ ప్యాకెట్స్, త్రాగునీరు అందజేశారు.

## ట్రిపుల్ ఐటికి 6మంది విద్యార్థులు ఎంపిక



**మర్రిపాడు, జూన్25, ప్రభాతవార్త:** మర్రిపాడు మండలంలోని నందవరం ఆదర్శ పాఠశాలకు చెందిన 5మంది విద్యార్థులు, కదిరినాయుడుపల్లి ఉన్నతపాఠశాలకు చెందిన ఒక విద్యార్థి ట్రిపుల్ ఐటికి ఎంపికయ్యారని మండల విద్యాశాఖ అధికారులు జ్యోతి, ధనలక్ష్మిలు తెలిపారు. 10వ తరగతి ఫలితాల్లో మండలంలో మొదటి 5స్థానాలు సాధించిన నందవరం ఆదర్శపాఠశాలకు చెందిన మహిత నూజివీడు క్యాంపస్‌కు, లహరి, రమ్య, వెంకటమనోహర్, యశ్వంత్ ఇడుపులపాయ క్యాంపస్‌కు, కదిరినాయుడుపల్లి ఉన్నతపాఠశాల కు చెందిన విద్యార్థి శృతి ఒంగోలు క్యాంపస్‌కు ఎంపికయ్యారన్నారు. నందవరం మోడల్ స్కూల్‌కు చెందిన 5మంది విద్యార్థులు ఐటికిఎ ఎంపిక కావడంపై ప్రిన్స్‌పాల్ లక్ష్మీనారాయణ, పాఠశాల సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. కదిరినాయుడుపల్లి ఉన్నతపాఠశాల విద్యార్థిని ట్రిపుల్ ఐటికి ఎంపిక కావడం పట్ల ప్రధానోపాధ్యాయుడు రవీంద్ర, పాఠశాల ఉపాధ్యాయులు, పాఠశాల అభివృద్ధికి నిరంతరం సహాయ సహకారాలు అందిస్తున్న గ్రామానికి చెందిన ప్రవాస భారతీయుడు ఓబులురెడ్డి, శ్రీనివాసులురెడ్డి, కేశవరెడ్డి తదితరులు అభినందనలు తెలిపారు.

## అల్లూరులో విద్యుత్ సరఫరా కు అంతరాయం

**అల్లూరు, జూన్ 25 ప్రభాతవార్త:** అల్లూరు సబ్ స్టేషన్ టౌన్ పరిధిలో మరమ్మత్తుల నిమిత్తం గురువారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ వినియోగదారులు సహకరించ వలసిందిగా అల్లూరు టౌన్ విద్యుత్ శాఖ ఏఈ మస్తాన్ షరీఫ్ ఓ ప్రకటనలో తెలియజేశారు

## మా ఆరాధ్యదైవం ఎన్‌టిఆర్ విగ్రహ ఏర్పాటుకు అనుమతివ్వండి



**జలదంకి, జూన్25, ప్రభాతవార్త:** చలనచిత్ర రంగంలో మకుటంలేని మహరాజుగ వెలుగొంది రాజకీయ రంగంలోకూడ అందరికి ఆదర్శప్రాయుడిగ వేనోళ్ళ కొనియాడబడిన రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారకరామారావు విగ్రహ ఏర్పాటుకు అనుమ తులివ్వాలని జలదంకి మండలం తెలుగు దేశంపార్టి అధ్యక్షుడు పులిగుంట మధుమోహన్‌రెడ్డి విజ్ఞప్తిచేశారు.బుధవారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో పార్టీ శ్రేణులతో పంచాయతిరాజ్ ఎఇ వాణిని పులిగుంట కలిశారు.ఈమేరకు వినతిపత్రం అందజేశారు.మాఅందరి చిరకాలవాంశయిన నందమూరి విగ్రహ ఏర్పాటు స్థానిక ఆర్‌టిసి బస్టాండ్‌కు సమీపంలోని పంచాయతి స్థలం అనువైనదిగ నిర్ణయించామన్నారు.దానికి పంచాయతి అనుమతికూడా తీసుకున్నామని కావున త్వరితగతిన మీరుకూడ అనుమతిస్తే మాకోరికి తీరుతుంద న్నారు.దీంతో ఎఇ సానుకూలంగ స్పందించడంతో అందరు హర్షం వ్యక్తంచేశారు. మధురెడ్డి వెంట గ్రామ పార్టి అధ్యక్షుడు వింతా సుబ్బారెడ్డి,యువనేత పులిగుంట మహేంద్రరెడ్డి,కుంకు వెంకటేశ్వర్లు ,మారుబోయిన నారాయణ,ఒంగోలు మధన్,భీమవరపు తిరుపతయ్య,గోసు రాములు, సుబరాయుడు,దేవరపల్లి రవిరెడ్డి,పులివర్తి సుధాకర్ తదితర పార్టీ శ్రేణులు వున్నారు.

## మోటార్ సైకిల్, ఆటో ఢీ

– యువకునికి తీవ్రగాయాలు



**కోవూరు, జూన్25 ప్రభాతవార్త :** కోవూరు మండలం వేగూరు కాలువ సమీపంలో బుధవారం నెల్లూరు వైపు నుంచి కోవూరు వైపు వస్తున్న మోటార్ సైకిల్ అదే మార్గంలో ప్రయాణిస్తున్న ఆటోను వేగంగా ఢీకొంది. ఈ సంఘటనలో మోటార్ సైకిల్‌పై ప్రయాణిస్తున్న ఇందుకూరుపేట మండలం నాగరాజుతోపు గ్రామానికి చెందిన ఆర్. వినోద్‌కు కాలు విరిగి తీవ్రగాయాలయ్యాయి. ఈ మేరకు 108 వాహనంలో వినోద్‌ను ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రంగనాథ్ గౌడ్ తెలిపారు.

## నేటి నుంచి వృద్ధులకు రేషన్ పంపిణీ



**కోవూరు, జూన్25 ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని అన్ని గ్రామాల్లో 2440 మంది వృద్ధులకు నేటి నుంచి రేషన్ పంపిణీ ఇంటి దగ్గరే ఇవ్వడం జరుగుతుందని తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య అన్నారు. కోవూరులోని ఆంజనేయ స్వామి వీధిలో ఉన్న చౌక డిపోను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి 30 వరకు 60 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు రేషన్ పంపిణీ సకాలంలో పూర్తిచేసేలా సంబంధిత డీలర్లు తగు చొరవ తీసుకోవాలన్నారు. ఈ వృద్ధులకు రేషన్ పంపిణీ సంబంధించి గ్రామ సచివాలయ ఉద్యోగులు కూడా సక్రమంగా పర్యవేక్షించాల్సిన అవసరం ఉందని , ఈ మేరకు వారికి ఆదేశాలు కూడా ఇవ్వడం జరిగిందన్నారు. 30వ తేది లోగా ఈ పంపిణీ పూర్తి కావాలన్నారు. ఈ సందర్భంగా ఆయన డీలర్‌కు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రేషన్ డీలర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జీవీ కృష్ణారెడ్డి ఉన్నారు.

# అపోలో హాస్పిటల్ క్యాన్సర్‌కు అత్యాధునిక వైద్య సేవలు




- అన్నీ రకాల క్యాన్సర్లకు అపోలో హాస్పిటల్‌లో అధునాతన వైద్య సేవలు
- రోగులకు ఆరోగ్యకరమైన జీవితం ప్రసాదిస్తున్న క్యాన్సర్ వైద్య బృందం
- క్యాన్సర్ విన్ పేరుతో క్యాన్సర్ నివారణకు అపోలో హాస్పిటల్ కృషి
- అపోలో చికిత్స వల్లే క్యాన్సర్‌ను జయించినట్లు పలువురు రోగుల మనోగతం
- వివరాలు వెల్లడించిన డాక్టర్ శ్రీరామ్ సతీష్, అంకాలజీ వైద్య బృందం

**నెల్లూరు, జూన్ 25, ప్రభాతవార్త– వైద్యం** నెల్లూరు అపోలో స్పెషాలిటీ హాస్పిటల్ అన్నీ రకాల క్యాన్సర్‌లకు అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని హాస్పిటల్ డాక్టర్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరామ్‌సతీష్ తెలిపారు. హాస్పిటల్ అంకాలజీ ఫిజీషియన్ డాక్టర్ హరిత, సర్జికల్ అంకాలజిస్టు డాక్టర్ జీవీ ప్రసాద్, మానసిక వైద్యులు డాక్టర్ లక్ష్మీ రాజేష్, యూనిట్ హెడ్ బాలరాజుతో కలి సి డాక్టర్ శ్రీరామ్ సతీష్ మీడియాతో మాట్లాడారు. అపోలో సంస్థ దేశదేశ వ్యాప్తంగా క్యాన్సర్ విన్ అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని చెప్పారు. క్యాన్సర్ విన్ కార్యక్రమంలో భాగంగా క్యాన్సర్ వ్యాధి భారిన పడి అపోలో హాస్పిటల్‌లో చికిత్స తీసుకుని, క్యాన్సర్‌ను పూర్తిగా జయించి నేడు ఆరోగ్యకరమైన జీవితం గడుపుతున్న వారి మనోగతాలను ప్రజలకు తెలియజేస్తున్నామని పేర్కొన్నారు. క్యాన్సర్ వ్యాధి భారిన పడినప్పుడు వారు ఎలాంటి సమస్యలు ఎదుర్కొన్నారు. అపోలో హాస్పిటల్స్‌లో చికిత్స ఎలా అందించారు. క్యాన్సర్‌ను పూర్తిగా జయించిన తర్వాత వారి యొక్క ఆరోగ్యకరమైన జీవన శైలి ఎలా ఉంది అనే వివరాలను స్వయంగా వారే వివరిస్తారని వెల్లడించారు. క్యాన్సర్ రోగుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు అపోలో విన్ కార్యక్రమాన్ని నెల్లూరుఅపోలో స్పెషాలిటీ హాస్పిటల్‌లో కూడా నిర్వహించడం సంతోషంగా ఉందని వైద్యులు తెలియజేశారు. నెల్లూరు అపోలో హాస్పిటల్‌లో అన్ని రకాల క్యాన్సర్లకు అధునాతనమైన వైద్య చికిత్సలు అందుబాటులోఉన్నాయని, అందుబాటులో ఉంటారని స్పష్టం చేశారు. క్యాన్సర్‌ను ముందుగానే గుర్తిస్తే దాన్ని జయించడం కష్టమేనని కాదని అభిప్రాయపడ్డారు. పెద్ద పెద్ద మెట్రో నగరాలకే పరిమితమైన అధునాతన క్యాన్సర్‌చికిత్సలు నెల్లూరు అపోలో హాస్పిటల్‌లో అందుబాటులో ఉన్నాయని తెలియజేశారు. వైద్యుల ప్రసంగం అనంతరం నె ల్లూరు అపోలో హాస్పిటల్‌లో చికిత్స తీసుకుని క్యాన్సర్ ను జయించిన వారు మాట్లాడారు. కేవలం అపోలో హాస్పిటల్ చికిత్స కారణంగానే తాము నేడు ఆరోగ్యకరమైన జీవితం గడుపుతున్నామని తెలియజేశారు.

## టీబీ నిర్మూలన దిశగా అడుగులు




**నెల్లూరు అగ్రికల్చర్, జూన్ 25, ప్రభాతవార్త** టీబీ వ్యాధిని మరో మూడు నెలల్లో జిల్లాలో పూర్తిగా నిర్మూలించే లక్ష్యంతో పని చేస్తున్నామని లెప్రసీ ఎయిడ్స్, టీబీ నిర్మూలన వైద్యాధికారి ఖాదర్ వలి తెలిపారు. నెల్లూరులోని జీజీహెచ్ ప్రాంగణంలో ఉన్న ఏసీఎస్ఆర్, వైద్య కళాశాలలో కోర్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా టీబీ నిర్మూలన వైద్యాధికారి ఖాదర్ వలి మాట్లాడుతూ ప్రధానమంత్రి టీబీ ముక్తబార్ అభియాన్ పథకం ద్వారా టీబీ వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు వెల్లడించారు. జిల్లాలో టీబీని పూర్తిగా నిర్మూలించే లక్ష్యంతో ఉన్నామన్నారు. అంతే కాకుండా ఎన్టీఈపీ కార్యక్రమంలో భాగంగా పలు అంశాలను ప్రస్తావించారు. ఏసీఎస్ఆర్ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజ్యలక్ష్మీ, పలమనాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ అరుణ, వివిధ విభాగాల హెచ్‌ఓడీలు, టీబీ నివారణ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మంత్రులు రామానాయుడు, నారాయణలను కలిసిన ఎమ్మెల్యే





**కావలిరూరల్, జూన్25 ప్రభాతవార్త** కావలి పట్టణ నడిబొడ్డున మాగుంట పార్వతమ్మ ట్రంకురోడ్డులో ఏర్పాటు చేసిన బడుగు, బలహీన వర్గాల ఆశా జ్యోతి, కాపుజాతి ఆణిముత్యం స్వర్గీయ వంగవీటి మోహనరంగా కాంశ్య విగ్రహం ఆవిష్కరణ కార్యక్రమం జులై 2వ తేదీన జరుగుతున్నందున రాష్ట్ర జలవనరులశాఖామంత్రి నిమ్మల రామానాయుడు, రాష్ట్రమున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖామంత్రి పొంగూరు నారాయణలను బుధవారం కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి విజయవాడలోని వారి కార్యాలయాల్లో కలిసి ఆహ్వానించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రులు పాల్గొనాలని ఎమ్మెల్యే దగుమాటి, కావలి కాపునేతలు, రంగా అభిమానులు ఆహ్వానించడం జరిగింది. తప్పక విచ్చేస్తామని మంత్రులు ఎమ్మెల్యే దగుమాటికి హామీ ఇవ్వడం జరిగింది. అనంతరం నియోజకవర్గంలోని పలు సమస్యలపై మంత్రులతో ఎమ్మెల్యే దగుమాటి చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగుదేశంపార్టీ కావలి నియోజకవర్గ లీగల్‌సెల్ అధ్యక్షులు గుంటుపల్లి రాజ్‌కుమార్‌చౌదరి, టిడిపి నాయకులు దేవరకొండ శ్రీను, ఆళ్ల శ్రీను, ఇస్క విక్రమ్‌రెడ్డి, జనసేన నాయకులు సిద్ధు, కాపునేతలు, రంగా అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి ర్యాంకును సాధించిన పాలిటెక్నిక్ విద్యార్థి సందీప్



**కావలిరూరల్, జూన్25 ప్రభాతవార్త** కావలి, రుద్రకోట గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాలలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థి సిహెచ్ సందీప్ 2025 ఏప్రిల్‌లో నిర్వహించిన నాల్గవ సెమిస్టర్ పరీక్షల్లో 1000కి 988 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ర్యాంకును సాధించడం జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.సుశీల్‌కుమార్‌ప్రియ బుధవారం తెలియచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యలో నిబద్ధత, నైపుణ్యం, శ్రమతో సందీప్ ఈ ఘనత సాధించడం గర్వకారణంగా ఉందని తెలిపారు. సందీప్ విజయం తోటివిద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని తెలిపారు. సందీప్, విద్యార్థి తల్లిదండ్రులకు, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌శాఖ అధ్యాపకుల బృందానికి హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

## బుచ్చి ఆర్‌టిసి బస్టాండ్‌లో అభివృద్ధి పనులకు శ్రీకారం



**బుచ్చి జూన్ 25 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం ఆర్టీసి బస్టాండ్ అభివృద్ధి పనులు బుధవారం ఆర్టీ సి అధికారులు శ్రీకారం చుట్టారు. ఇటీవల బుచ్చిరెడ్డిపాళెం ఆర్టీసి బస్టాండ్‌ను భారతీయ జనతాపార్టీ కిసాన్ మోర్చ జాతీయ ఉపాధ్యా క్షులు, ఆర్టీసి జోనల్ చైర్మన్ సన్న పురెడ్డి సురేష్‌రెడ్డి ఆర్టీసి అధికా రులతో కలిసి బస్టాండ్‌ను పరిశీలిం చారు. వెంటనే ఆర్టీసి బస్టాండ్ పనులు చేపట్టి అన్ని హంగులతో ఏర్పాటు చేయమని, ప్రజలకు సరైన సౌకర్యాలుకల్పించమని ఆర్టీసి అధికారులను ఆదేశించడం జరిగింది. బుధవారం నుండి ఆర్టీసి బస్టాండ్ అభివృద్ధి పనులు ప్రారంభం అయ్యాయి. ఈ అభివృద్ధి పనులను సిఐ సునీత, డిఇ . ఏఇల పర్యవేక్షణలో జరుగుతున్నాయి.

## దివ్యాంగుల పాలిట వరం జి.ఒ.నెంబర్4 : ఎమ్మెల్యే



**కోవూరు, జూన్ 25, ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మానవతా దృక్పథంతో తీసుకున్న నిర్ణయం దివ్యాంగుల పట్ల వరమైందని కోవూరు ఎమ్మెల్యే శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. బుధవారం నెల్లూరు నగరం మాగుంట లేఅవుట్ లోని ఆమె నివాసంలో ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి దివ్యాంగులకు సంబంధించిన పారా స్పోర్ట్ చైతన్య యాత్ర పోస్టర్ ను ఆవిష్కరించారు. విద్యార్హతలను బట్టి ఎలాంటి పోటీ పరీక్షలు లేకుండా దివ్యాంగులకు ప్రభుత్వ ఉద్యోగాలలో అవకాశాలు కల్పిస్తూ జి.ఒ.నెంబర్ 4 విడుదల చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి లోకేష్‌కు ఆమె ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో పారా స్పోర్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి వి.రామస్వామి గారు, నెల్లూరు జిల్లా అధ్యక్షుడు మాల్యాద్రి నాయుడు, గుంటూరు జిల్లా సెక్రటరీ డాక్టర్ వై శ్రీనివాస్ గౌడ్. నెల్లూరు జిల్లా సెక్రటరీ కటారి యాదగిరి గారు, ట్రైన్ ఇంచార్జ్ సురేష్, ఇంటర్నేషనల్ పారా క్రీడాకారిణి వి భవానీ, ఇంటర్నేషనల్ పారా స్విమ్మింగ్ క్రీడాకారుడు పోరెడ్డి చరిత్, వీల్ చైర్ నేషనల్ క్రికెటర్ పెంచలయ్య క్రీడాకారులు దివ్యాంగ సంఘ నాయకులు పాల్గొన్నారు.

## బాధిత బాలిక బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుంది - మంత్రి గుమ్మిడి సంధ్యారాణి



**నెల్లూరు కలెక్టరేట్, జూన్ 25, ప్రభాతవార్త** బుధవారం ఉదయం అపోలో ఆసుపత్రిలో జిల్లా కలెక్టర్ ఆనంద్‌తో కలిసి బాలికను మంత్రి సంధ్యారాణి పరామర్శించారు. బాలిక ఆరోగ్య స్థితిగతులను వైద్యులను అడిగి ఆమె తెలుసుకున్నారు. బాలిక త్వరగా కోలు కునేలా మెరుగైన వైద్యం అందించాలని ఆమె వైద్యులకు సూచించారు. ఈ సందర్భంగా మంత్రి సంధ్యారాణి మీడియాతో మాట్లాడుతూ ఇందుకూరుపేట మండలం కుడితిపాలెం కాకర్ల దిబ్బలో సెల్ ఫోను దొంగిలించిందని అనుమానంతో బాలికను పక్కింటి వారు వాతలు పెట్టి హింసించడం అత్యంత క్రూరమైన చర్య అని, ఇలాంటి సంఘటనలు చూస్తుంటే మానవత్వం మంటగలిసి పోయిందా అనే బాధ కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బాధను వ్యక్తం చేశారని, వారి ఆదేశాల మేరకు బాలికను పరామర్శించి ప్రభుత్వం తరఫున రూ. 50వేలు అందించామని చెప్పారు. విద్యాశాఖ మంత్రి లోకేష్ బాబు సూచనల మేరకు ఆ బాలికకు అవసరమయ్యే పూర్తి విద్యను ఉచితంగా ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల ద్వారా అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఆమె చెప్పారు. ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని, చట్టం తన పని తను చేసుకుపోతుందని ఆమె ఈ సందర్భంగా చెప్పారు. మంత్రి వెంట స్థానిక నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, ట్రైబల్ వెల్ఫేర్ ప్రాజెక్ట్ ఆఫీసర్ మల్లి కార్జు రెడ్డి, ఐసిడిఎస్ పిడి హేనా సుజన్ తదితరులు ఉన్నారు.

## గిరిజనుల జీవితాల్లో మార్పు తేవడం మనందరి బాధ్యత

- పేదరికం నుంచి గిరిజన బిడ్డలకు విముక్తి కల్పించడమే లక్ష్యంగా పనిచేయాలి
- మంత్రి సంధ్యారాణికి ఆత్మీయ ఆహ్వానం పలికిన సోమిరెడ్డి



**నెల్లూరు కలెక్టరేట్, జూన్ 25, ప్రభాతవార్త** సమా జంలో అత్యంత పేదరికంలో ఉన్నది గిరిజనులే అని అమాయకులు, నిరక్షరాస్యులు కూడా వారే అని పోషకాహార లోపంతో బాధపడుతున్న వారిలో కూడా ఎ క్కువ మంది గిరిజనులే, ప్రతి గిరిజన బిడ్డను స్కూ లుకు పంపించే బాధ్యతను అధికారులు తీసుకోవాలి అక్కడ వారికి విద్యతో పాటు పోషకాహారం అందే సౌలభ్యం ఉంది గతంలో మల్లికార్జునపురంలో గిరిజ నుల దుస్థితిని నేను ప్రత్యక్షంగా చూసి వారిలో మా ర్పు తేవాలని గ్రామాన్ని దత్తత తీసుకున్నాను. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులకు అదనంగా వేసి గిరి జనుల కోసం నాణ్యతతో కూడిన ఇళ్లు కట్టించాం గత వైసీపీ పాలనలో గిరిజనుల కోసం కట్టిన ఇళ్లను కాళ్ల తో తంతే కూలిపోయేలా ఉన్నాయి గిరిజనులకు ఇంత అన్యాయం జరుగుతుంటే సచివాలయ ఉద్యోగులు, అధికారులు ఏం చేస్తున్నట్టు.. కిటికీలు, తలుపులు ఇచ్చినట్టు రికార్డుల్లో వేలిముద్రాలు వేయించుకున్నారు అత్యంత నాసిరకంగా జరుగుతున్న నిర్మాణాలకు బిల్లులు చేయడానికి అధికారులకు మనస్సు ఎలా వస్తోంది ప్రభుత్వ పథకాలు పొందేందుకు కనీస అవసరమైన ఆధార్ కార్డుకు కూడా నోచుకోకుండా వందల గిరిజన కుటుంబాలు ఉండటం బాధాకరం ముత్తుకూరు మండలం పైనాపురం పంచాయతీలో గిరిజనులకు ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు లేకపోవడం నేనే స్వయంగా చూసి ఈ విషయాన్ని సీరియస్ గా తీసుకున్నాను ముత్తుకూరు మండలంలో 680 మందికి, టీపీ గూడూరు మండలంలో 580 మందికి ఆధార్ కార్డులు లేకపోవడం గుర్తించాం కలెక్టర్ సహకారంతో స్పెషల్ డ్రైవ్ చేపట్టి సర్వేపల్లి నియోజకవర్గంలో మొత్తం 2 వేల మందికి ఆధార్ కార్డులు చేయించామన్నారు. ఈ సమస్యను టీడీపీ పొలిట్ బ్యూరోతో పాటు అసెంబ్లీలోనూ ప్రస్తావించాను అని గిరిజనుల విషయంలో ప్రభుత్వం కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు ఒక్కో సచివాలయంలో 11 మంది ఉద్యోగులు ఉన్నారు. ఒక్కో ఉద్యోగి రోజుకు 10 ఇళ్లకు పెళ్లి ప్రజల బాగోగులు తెలుసుకున్నా సమస్యలన్నీ పరిష్కారమవుతాయి సచివాలయం ఉద్యోగులు పలువురు సకాలంలో విధులకు హాజరుకావడం లేదు..వచ్చిన వారిలోనూ అందరికీ పని ఉండటం లేదు గిరిజనులకు కనీసం ఆధార్ కార్డు కూడా లేకపోతే సచివాలయ ఉద్యోగులు ఏం చేస్తున్నట్లు అప్పట్లో నెల్లూరుకు ఐటీడీఏ మంజూరు చేయించుకోవడానికి అనేక అవరోధాలు ఎదురయ్యాయి. మా జిల్లాలో చల్లా యానాదులు చాలా దుర్భర పరిస్థితుల్లో ఉన్నారని చంద్రబాబు నాయుడిని ఒప్పించి సాధించుకున్నాం ఒక్క సర్వేపల్లి నియోజకవర్గంలోనే కాదు, జిల్లా వ్యాప్తంగా, రాష్ట్ర వ్యాప్తంగా గిరిజనుల సంక్షేమంపై అధికారులు ప్రత్యేకదృష్టి పెట్టాలని కోరుతున్నానన్నారు. ప్రతి గిరిజన కుటుంబానికి ఆధార్ కార్డులు మంజూరుచేసే లక్ష్యంగా పెట్టుకోవాలని అధికారులకు ఆదేశాలివ్వాలి ప్రభుత్వం తరఫున ఏసంక్షేమ పథకం పొందాలన్నా ఆధార్‌కార్డు కనీస అవసరంగా మారిన అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలి పంచాయతీ కార్యదర్శుల నుంచి కలెక్టర్ వరకు గిరిజనుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి పెట్టి వారిని పేదరికం నుంచి బయటేయాలి అని సోమిరెడ్డి అన్నారు.

## పాఠశాల స్థాయి పెంచారు.. వసతులు మరిచారు

### కోవూరు మండలం ఇనమడుగు గ్రామంలో




**కోవూరు, జూన్25 ప్రభాతవార్త :** ప్రభుత్వం విద్యాశాఖలో సమూలమైన మార్పులకు శ్రీకారం చుట్టినా పలు పాఠశాలల్లో ఆశించిన మేర గదులు లేక చెట్ల కిందనే ఉపాధ్యా యులు విద్యార్థులకు చదువు చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఫలితంగా విద్యార్థులు నేలమీద , చెట్ల కింద కూర్చొని పాఠాలు వినాల్సిన పరి స్థితి ఏర్పడింది. ఉన్న పాఠశాల స్థాయి పెం చారే తప్ప ఆశించిన మేర వసతులు కల్పించకపోవడంతో ఈ దుస్థితి ఏర్పడింది. ఈ దుస్థితి ఎక్కడో మా రుమూల ప్రాంతంలో కాదు.. నియోజకవర్గంకు మండల కేంద్రమైన కోవూరు మండలం ఇనమడుగు గ్రామంలో నెలకొంది. ఇటీవల ప్రభుత్వం 61 మంది విద్యార్థులకు పైగా ఉంటే ఆ పాఠశాలను మోడల్ ప్రైమరీ పాఠశాలగా ఏర్పాటు చేసి ఒక్కో తరగతికి ఒక్కో టీచర్ చొప్పున ఐదు మంది టీచర్లను కూడా ఏర్పాటు చేశారు. ఇనమడుగు పాఠశాలలో 65 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఉపాధ్యాయులు ఐదు మంది ఉన్నా తరగతి గదులు రెండే కావడంతో మిగిలిన విద్యార్థులకు సమీపంలోని చెట్ల కింద ఉపాధ్యాయులు పాఠాలు చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడింది. కేవలం ప్రభుత్వం పాఠశాల స్థాయి పెంచిందే తప్ప దానికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంలో పూర్తిగా విఫలమైంది. ఫలితంగా భావిభారత పౌరులైన విద్యార్థులు, చెట్ల కింద, నేలమీద పాఠాలు చెప్పించు కోవాల్సిన పరిస్థితి నెల కొంది. ఇప్పటికైనా సంబంధిత విద్యాశాఖ అధికారులు స్పందించి మోడల్ ప్రైమరీ స్కూల్‌గా ఏర్పాటు చేసిన పాఠశాల ల్లో విద్యారులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించే దిశగా చొరవ తీసు కోవాలని వి ద్యార్థుల తల్లి దండ్రులు కోరు తున్నారు.



## మాజీముఖ్యమంత్రి జగన్ వికృత చేష్టలు మానుకోవాలి



**నెల్లూరు, జూన్25 ప్రభాతవార్త–విద్య** మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తన వికృత చేష్టలను మానుకోవాలని జనసేన నగర అధ్యక్షులు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు హితవు పలికారు. బుధవారం నగరంలోని స్థానిక మాగుంట లే అవుట్‌లోని ఆపార్టీ నగర కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు జులై3న నెల్లూరు పర్యటనకు రానన్న జగన్‌ను చూసి ప్రజలు భయపడి పోతున్నారన్నారు. మాజీ మంత్రి కాకాణిని జైల్లో పరా మిర్శించేందుకు వస్తున్న జగన్ ఈ సారి ఎందమంది ప్రజలపై వారి కారును తోకి స్తూ వెళతారో, మరెంత మంది ప్రాణాలను బలి గోంటారో అర్దం కావటం లేద న్నారు. గత ఐదేళ్ల వైకాపా పాల నలో ప్రజలు నానా కష్టాలను ఎదుర్కొన్నారన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రజలు సంతోషంగా ఉన్నారని తెలిపారు. పల్నాడు జిల్లాలో జరిగిన జగన్ పర్యటనలో సింగయ్య అనే కార్యకర్త జగన్ కారు చక్రాల కింద నలిగి చనిపోతే కనీసంకారుకూడా దిగి పరామర్శించలేదని, మూగసైగలు చేసుకుంటూ కమెడియన్‌లాగా ప్రవర్తించారని ఏద్దేవా చేశారు. రాక్షస పాలన , వికృత చేష్టలను ప్రజలు గమనించి జగన్‌కు 11 స్థానాలను ఇచ్చారని, ఇకనైనా పద్దతి మార్చుకోపేతే వచ్చే ఎన్నికల్లో ఆ 11 సీట్లు కూడా రావన్నారు. ఇప్పటికైనా బుద్ది తెచ్చుకోవాలని ఆయన కోరారు. పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఖరీఫ్ పంటలపై రైతులకు అవగాహన



**సైదాపురం, జూన్ 25, ప్రభాతవార్త** మండల పరిధిలోని కలిచేడు, తరిమెర్ల గ్రామంలోని రైతు సేవా కేంద్రం పరిధిలో మండల వ్యవసాయశాఖ అధికారిణి హైమావతి పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా గ్రామ సభ నిర్వహించారు. ఈ సందృంగా రైతులు వేసిన వరి పంటలను ఆమె సందర్శిం చారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సైదాపురం మండలంలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి సుమారు 500 ఎకరాలకు రైతులు వరి పంట సాగు చేయడం జరుగుతుందని తెలిపారు. వరి సాగు చేస్తున్న రైతులకు యూరియా కావాలంటే స్థానిక రైతు సేవ కేంద్రంలో అందుబాటులో ఉందని తెలిపారు. అలాగే పిల్లిపెసర, జిలుగ, జనుము వంటి విత్తనాలు కావాల్సిన వారు రైతు సేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి ఈకేవైసీ చేసుకోని రైతులు వెంటనే చేయించుకోవాలని అన్నారు. అదే విధంగా పీఎంకిసాన్ రానివారు కూడా రైతు సేవ కేంద్రంలో సంప్రదించాలని ఆమె తెలిపారు. ప్రభుత్వ పథకాలు, ఖరీఫ్ పంటలపై రైతులకు హైమావతి వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

## వ్యవసాయ శాఖ సలహాలు, సూచనలు తప్పక పాటించాలి




**పోతిరెడ్డిపాలెం(కోవూరు,) జూన్25 ప్రభాతవార్త :** ప్రస్తుతం ఈ ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయం సాగు చేసే రైతులు తప్పనిసరిగా వ్యవసాయ శాఖ సలహాలు, సూచనలు తప్పక పాటించాలని జిల్లా వ్యవసాయాధికారి పి. సత్యవాణి అన్నారు. కోవూరు మండలం పోతిరెడ్డిపాలెం గ్రామంలో రైతు ఆదిశేషారెడ్డి పొలాన్ని బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు వ్యవసాయ శాఖ సిఫార్సు చేసిన మోతాదులోనే ఎరువులు, పురుగుమందులు వాడుకోవాలన్నారు. అట్లు కాక రైతులు తమ ఇష్టానుసారంగా ఎరువులు పురుగుమందులు వాడితే వివిధ రకాల తెగుళ్ల సోకడమే కాకుండా సాగు ఖర్చు కూడా ఘననీయంగా పెరిగే అవకాశం ఉంటుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని రైతులు ఎరువులు, నీటి యాజమాన్య పద్దతులను తప్పక పాటించాలన్నారు. శాస్త్రవేత్తలు ఇచ్చే సలహాలు, సూచనలను తప్పక రైతులు పాటించాలన్నారు. ఈ సందర్భంగా రైతులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు సుజాత, మండల వ్యవసాయాధికారిణి టి. రజిని, గ్రామ వ్యవసాయ సహాయకులు చాద్విక, చైతన్య, రైతులు ఉన్నారు.

## సాంకేతిక పద్ధతులపై రైతులు అవగాహన చేసుకోవాలి




**కోవూరు, జూన్25 ప్రభాతవార్త :** వ్యవసాయ రంగంలో వస్తున్న నూతన సాంకేతిక పద్ధతులపై రైతులు మరింత అవగాహన చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి అన్నారు. కోవూరు మండలం పోతిరెడ్డిపాలెం పంచాయతీ రైతు సేవా కేంద్రంలో బుధ వారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన కల్పించే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయం సాగు చేసే ప్రతి రైతులకు వ్యవసాయ శాఖ అనుబంధ శాఖలపై మరింత అవగాహన కల్పించేందుకే ఇటువంటి సదస్సులను క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్యంగా రైతులు యూరియాను తమ ఇష్టానుసారంగా వాడడం వలన సారవంతమైన భూమి చౌడుబారి దిగుబడి తగ్గే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం ఈ ఖరీఫ్ సీజన్‌లో 35 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా.. ఇప్పటివరకు 30 మెట్రిక్ టన్నుల యూరియాను అందజేయడం జరిగిందన్నారు. రైతులు సిఫార్సు చేసిన మోతాదులోనే కాకుండా తమ ఇష్టానుసారంగా ఎరువులు వాడడం వలన క్యాన్సర్ సోకే అవకాశం ఉందని ఇటీవల శాస్త్రవేత్తలు నిరూపించారన్నారు. కేవలం మొక్కలు 30 నుంచి 40 శాతం యూరియాను తీసుకుంటుండగా.. 60 శాతం యూనియా వాతావరణంలో కలుషితం అవుతుందన్నారు. ప్రస్తుతం రైతులు నానో యూరియాపై కూఆ అవగాహన చేసుకోవాలని ఈ సందర్భంగా ఆమె సూచించారు. ప్రస్తుతం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి రైతుకు సంవత్సరానికి పెట్టుబడి కింద అన్నదాత సుఖీభవ పథకం ద్వారా 20 వేల రూపాయలను మూడు దఫాలుగా వారి వారి ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం డ్రోన్ ద్వారా మందులు పిచికారి చేయడం వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని, రైతులు గ్రూపులు ముందుకు వచ్చి 80 శాతం సబ్సిడీతో డ్రోన్‌లను పొందాలన్నారు. ఇంకా జిల్లాలో 2000 మంది రైతులు ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉందన్నారు. ఈకేవైసీ చేయించుకుంటేనే రైతులకు ప్రభుత్వం ద్వారా వివిధ పథకాలు అందుతాయన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు నర్సోజీ, సుజాత, మండల వ్యవసాయాధికారిణి టి. రజిని, వీఆర్వో నాగేశ్వరరావులు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా రైతులు పలు విషయాలపై అధికారులకు వినతిపత్రం అందజేశారు.

## మంత్రి సంధ్యారాణిని సత్కరించిన గునుకుల



**నెల్లూరు, జూన్25 ప్రభాతవార్త–విద్య** రాష్ట్ర మహిళా శిశు, గిరిజన సంక్షే మశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి నెల్లూరుకు విచ్చేసిన సందర్భంగా బుధవారం జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ మద్యాధపూర్వంగా కలసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రిని గునుకుల శాలువాకప్పి, పుష్పగుచ్చాలు అందించి సత్కరించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతు జిల్లాలోని కోవూరు, సర్వేపల్లి నియోజకవర్గాల్లో ఇంకా ఆధార్ కార్డులు, సంక్షేమ పదకాలు అందరికి అందలేదన్నారు. సర్వేపల్లి థర్మల్ ప్లాంట్ యాష్ పాండ్స్ వల్ల ఆరోగ్య సయస్యలతో ఇబ్బంది పడుతున్న గిరిపుత్రులను పునరావాస కేంద్రాలకు తరలించాలని కోరారు. అలాగే అన్నీ మండల కేంద్రాల్లో ప్రజల సౌకర్యార్ధం ఆధార్ కేంద్రాలను ఏర్పాటుచేయ్యాలన్నారు. ఈ కార్యక్రమంలోజనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైన ఎన్‌విగార్డెన్స్ జెడ్పీ పాఠశాల విద్యార్థులు



**నెల్లూరు, జూన్25 ప్రభాతవార్త–విద్య** 27నుండి ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో జరుగనున్న 33వ జాతీయస్థాయి బేస్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు నగరంలోని స్థానిక నవలాకులతోట లోని జెడ్పీ పాఠశాల విద్యార్థులు మహమ్మద్ సోహిల్, గోళ్ల రూప, కుంటి హనోక్, సదనపల్లి కిరణ్‌కుమార్‌లు ఎంపికైయ్యారు. ఈ సందర్భంగా స్థానిక పాఠశాలలో విద్యార్థులకు అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.శ్రీనివాసులు మాట్లాడుతు జాతీయస్థాయిలో జరిగే పోటీల్లో మన రాష్ట్రం తరపున తమ పాఠశాల విద్యార్థుల ప్రాతినిధ్యం వహించటం సంతోషంగా ఉందన్నారు. జరుగనున్న పోటీల్లో కూడా వీరు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పిడి.మల్లిఖార్జున రెడ్డి, పాఠశాల కమిటి చైర్మన్ ఎండి ఖాజా జమీర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆనం అరుణమ్మ కలిసిన బుచ్చి ఎంపిడిఓ



**నెల్లూరు కలెక్టరేట్, జూన్ 25, ప్రభాతవార్త** జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మని ఇటీవల బుచ్చిరెడ్డిపాలెం ఎంపిడిఓగా పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించిన ఎం. నారాయణ రెడ్డి మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది.